సాక్షి కుమురం భీం

శనివారం : 4 : జనవరి : 2025

సావిత్రిబాయి పూలేకు నివాళి



సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. మోడి ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థిని సావిత్రిబాయి వేషధారణలో ఆకట్టుకుంది. 11లో▸



ప్లాస్టిక్.. పరేషాన్..!

జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ కారణంగా డ్రెయినేజీ మూసుకుపోయి సమస్యలు తలెత్తున్నాయి. 11లో▸

గరిష్టం/కనిష్టం
28.6 / 13.5

వాతావరణం

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. చలిగాలులు వీస్తాయి. చలిప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

11న హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో ఈ నెల 11న ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల 38వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కమిటీ ప్రతినిధులతో కలిసి వర్ధంతి ఆహ్వాన పత్రిక, కరపత్రాలు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి హైమన్ డార్ఫ్ దంపతులు వర్ధంతి విజయవంతం చేయాలన్నారు. అడవి బిడ్డల జీవన స్థితిగతులను అధ్యయనం చేసేందుకు హైమన్ డార్ఫ్ దంపతులు తమ జీవితాన్ని ధారపోశారని తెలిపారు. ఆదివాసీల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మహనీయులని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: మెరుగైన ఫలితాలు సాధించేందుకు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబుతో కలిసి జిల్లాలోని ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యాశాఖ రూపొందించిన కార్యాచరణ ప్రకారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించేందుకు సాధన చేయించాలన్నారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, ఎస్‌వోలు శ్రీనివాస్, అబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ప్రశ్నలు వేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. వంటశాలతోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సౌకర్యాలతో కూడిన విద్యనందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో సుభాష్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర' ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శృతిక, ఉద్యోగులు నాగేష్, సంతోష్, రవి, రమేశ్, రజిత, రమ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్ పెట్టేలా..!

- జిల్లాలో కొనసాగుతున్న 'ఎనీమియా ముక్త్ తెలంగాణ'
- పది బృందాల ఏర్పాటు
- రెండు విడతల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు
- ఫలితాల ఆధారంగా ఐరన్ మాత్రలు పంపిణీ



నామానగర్ పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య బృందం

వాంకిడి(ఆసిఫాబాద్): కౌమార దశలోని బాలబాలికల్లో రక్తహీనతకు చెక్ పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఎనిమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమాన్ని చేపట్టింది. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గతేడాది జనవరి నుంచి పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. మొదటి విడతలో 8, 9, 10వ తరగతులతోపాటు ప్రభుత్వ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు 21,900 స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు 17,498 మందికి నిర్వహించారు. రెండో విడతలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 5, 6, 7 తరగతుల వారిలో 12,451 మందికి పరీక్షలు చేశారు. రక్తహీనతతో ఆరోగ్యం దెబ్బతిని చదువుపై ఆసక్తి లోపిస్తుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం జిల్లా వ్యాప్తంగా పది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అధిక శాతం పిల్లల్లో హిమోగ్లోబిన్ లోపం ఉన్నట్లు గుర్తించారు. చిన్నారుల్లో రక్తహీనతను నివారించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

స్క్రీనింగ్ పరీక్షలు

జిల్లాలో 1,265 ప్రభుత్వ పాఠశాలలు, 17 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 38 ఆశ్రమ పాఠశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఏడు గిరిజన సంక్షేమ గురుకులాలు, 18 కేజీబీవీలు, ఐదు మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలు, మూడు మైనార్టీ, రెండు మోడల్ స్కూల్స్, 19 ఎస్సీ, ఎస్టీ, బీసీ పోస్ట్ మెట్రిక్ పాఠశాలలు, 735 ప్రభుత్వ పాఠశాలలు(లోకల్ బాడీస్), 77 హైస్కూల్స్ ఉన్నాయి. ఎనిమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల్లో అధిక శాతం పిల్లలను రక్తహీనత వేధిస్తున్నట్లు వైద్యసిబ్బంది గుర్తించారు. మొదటి విడతలో 17,498 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా 5,891 మందికి (33శాతం) మంది రక్తంలో హిమోగ్లోబిన్ శాతం సాధారణంగా(12 గ్రాములు) ఉన్నట్లు గుర్తించారు. 3,688 మందిలో మాత్రం హిమోగ్లోబిన్ 11 నుంచి 11.9 గ్రాములు, 7,639 మందిలో 8 నుంచి 10.9 గ్రాములు, 1,227 మంది విద్యార్థుల్లో 8 గ్రాముల కంటే తక్కువ హెచ్‌బీ ఉన్నట్లు గుర్తించారు. 3,713 మందికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు రెండు దఫాలుగా పంపిణీ చేయగా.. 409 మందిని ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. రెండో విడతలో 5, 6, 7 తరగతుల్లో 12,451 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 4,663 మంది బాలబాలికల్లో హిమోగ్లోబిన్ సాధారణంగా ఉన్నట్లు గుర్తించారు. 3,379 మందిలో 11 నుంచి 11.9, 4,148 మందిలో 8 నుంచి 10.9, 261 మందిలో 8 గ్రాముల కంటే తక్కువ హెచ్‌బీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. 7,250 మంది విద్యార్థులకు విడతల వారీగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేశారు. రెండు విడతల్లో ఇప్పటి వరకు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ స్థాయి బాలబాలికలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు తెలిపారు.

ఐరన్ లోపంతోనే..

బాల్యం నుంచి సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోవడం వల్ల రక్తంలో ఐరన్ లోపం ఏర్పడుతుంది. ఇది రక్తహీనతకు దారి తీస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న జంక్ ఫుడ్ తోనూ ఈ సమస్య తీవ్రతరం అవుతుంది. గ్రామీణ ప్రాంతాలే కాకుండా పట్టణాల్లోనూ పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. సమయపాలన లేకుండా తినడం, చిప్స్, పిజ్జా, బర్గర్ వంటి ఆహార పదార్థాలకు ప్రాధాన్యత నివ్వడం వంటివి కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య నివారణకు ఐరన్ శాతం అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు అందించాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులలో అవగాహనలేమితో లోపాలు గుర్తించలేకపోతున్నారు. రక్తహీనత లోపం పిల్లల మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. తరచూ అనారోగ్యం బారిన పడుతుండంతో చదువుపైనా శ్రద్ధ చూపించరు. ప్రతీ విషయాన్ని అప్పటికప్పుడే మర్చిపోతుంటారు. జ్ఞాపక శక్తితో పాటు అనేక సమస్యలు ఐరన్ లోపంతో ఏర్పడతాయని వైద్యాధికారులు తెలిపారు.

తీసుకోవాల్సిన ఆహారం

ఐరన్ అధికంగా లభించే ఆహార పదార్థాలకు పిల్లలకు అందేలా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. ముఖ్యంగా ఆకుకూరలను నిత్యం వంటకాల్లో వాడాలి. పాలకూర, తోటకూర, బచ్చలి కూర, గోంగూర, కొత్తిమీర, కరివేపాకు, మునగాకు వంటివి తీసుకోవాలి. బాదం, కిస్మిస్, ఖర్జూర, బెల్లం, సీ విటమిన్ పుష్కలంగా లభించే పండ్లు ఇవ్వాలి. మాంసాహారం తీసుకునే వారు చికెన్, మటన్, లివర్ వంటివి తినాలి. ఐరన్, కాల్షియం ఉండేలా ఆహార పదార్థాలను ఎంచుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటే ఆరోగ్యం కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

నిరంతర ప్రక్రియ



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎనిమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుంది. మొదటి విడతలో 8వ తరగగతి నుంచి ఇంటర్ స్థాయి బాలబాలికలకు హిమోగ్లోబిన్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాం. సాధారణం కంటే తక్కువ హెచ్‌బీ ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాం. అత్యంత తక్కువ స్థాయిలో హెచ్‌బీ ఉన్న వారిని ఆస్పత్రులకు రెఫర్ చేసి చికిత్స అందిస్తాం. 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు రక్తపరీక్షల గురించి ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు.

– సీతారాం, డీఎంహెచ్‌వో

బాలికల విద్యకు సావిత్రిబాయి కృషి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేసిన సావిత్రిబాయి పూలే బాలికల విద్యకు ఎనలేని కృషి చేశారని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి, విద్యాశాఖ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. 18వ శతాబ్దంలో ఎలాంటి సౌకర్యాలు లేని రోజుల్లోనే ఆటంకాలు, అవాంతరాలు ఎదుర్కొని పాఠశాలలు ఏర్పాటు చేసి సావిత్రిబాయి బాలికలకు విద్యనందించేందుకు కృషి చేశారని తెలిపారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లాలోని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 50 శాతానికి పైగా మహిళా ఉపాధ్యాయులే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సహాయ సంచాలకుడు గమ్మానియల్, ప్రధానోపాధ్యాయుడు ఉదయ్ బాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

ఆసిఫాబాద్‌రూరల్: తిర్యాణి మండలంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ తిర్యాణి మండలం నాయకపుగూడలోని గురుకుల పాఠశాలలో 537 మంది బాలికలు చదువుతున్నారని తెలిపారు. నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. నాయకులు లెనిన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఏకసభ్య కమిషన్'కు వినతుల వెల్లువ

- భారీగా తరలివచ్చి.. అర్జీలు అందజేసి
- రాష్ట్రంలోనే అత్యధికంగా వెయ్యికిపైగా దరఖాస్తులు
- ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా అభిప్రాయాలు వెల్లడి
- మాల, మాదిగల పోటాపోటీ నినాదాలతో ఆదిలాబాద్‌లో ఉద్రిక్తత



అర్జీలు స్వీకరించి అభిప్రాయాలు తెలుసుకుంటున్న కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం చేసేందుకు గాను రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్‌తో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శుక్రవారం ఆదిలాబాద్‌లో బహిరంగ విచారణ చేపట్టింది. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన అభిప్రాయ సేకరణ నిర్వహించింది. నాలుగు జిల్లాల నుంచి మాల, మాదిగ ఉపకులాలకు చెందిన సాధారణ ప్రజలతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, కుల సంఘాల ప్రతినిధులు భారీగా తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా జాతరను తలపించింది. చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేసిన ఆయా వర్గాల వారు ఎస్సీ వర్గీకరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

వెయ్యికి పైగా దరఖాస్తులు

ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వర్గీకరణ కమిషన్ చైర్మన్ వినతులు స్వీకరిస్తారని అధికారులు తొలుత ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా ప్రాంతాల నుంచి మాల, మాదిగ ఉపకులాలకు చెందిన వారు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని మరి తమ వినతులను కమిషన్‌కు అందజేశారు. మూడున్నర గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. చైర్మన్ షమీమ్ అక్తర్, దళిత అభివృద్ధి శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియా, ఆర్డీవో వినోద్‌కుమార్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేని విధంగా అత్యధికంగా వెయ్యికిపైగా అందినట్లు అధికారులు వెల్లడించారు. మాల, మాదిగ, బేడ బుడగజంగం, మిత్తల్‌అయ్యవార్, మహార్, మాంగ్, చిందు, కొండదాస్ వంటి 11కులాలకు చెందిన వారు హాజరై అర్జీలు అందజేశారు. తమ కులాల స్థితిగతులు, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ పరంగా వెనుకబాటును కమిషన్‌కు వివరించారు. మాల, దాని ఉపకులాల వారు వర్గీకరణ చేయవద్దంటూ విజ్ఞప్తి చేయగా.. మాదిగ, దాని ఉపకులాల వారు వర్గీకరణ జరిగేలా చూడాలని నివేదించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీఎస్సీడీవోలు సునీతకుమారి, రాజేశ్వర్‌గౌడ్, రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు మనోహర్, శంకర్, దుర్గాప్రసాద్, సజీవన్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత ...

ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పుచప్పుళ్ల నడుమ చైర్మన్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఏకసభ్య కమిషన్ చైర్మన్ బయటకు వెళతుండటంతో వారు నిరసన వ్యక్తం చేశారు. మాదిగలకు అన్యాయం చేస్తున్నారంటూ కార్యాలయంలోని ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో మాల కులస్తులు సైతం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ప్రతిగా నినాదాలు చేశారు. ఇలా మాల, మాదిగల అనుకూల, నినాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీన్ని గుర్తించిన పోలీసులు డీఎస్పీ జీవన్ రెడ్డికి సమాచారం అందించడంతో సాయుధ బలగాలతో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

సీతాగోందిలో అభిప్రాయ సేకరణ

గుడిహత్నూర్: ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ నేపథ్యంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ ష మీమ్ అక్తర్ శుక్రవారం మండలంలోని సీతాగోంది గ్రామంలో పలు మహార్ కుటుంబ పెద్దలతో ముచ్చటించారు. ప్రధాన వృత్తి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, మండల ప్రత్యేకాధికారి సునీత, తహశీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో అబ్దుల్‌హై తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. అందులో భాగంగా మెదక్ జిల్లాతో ప్రారంభించి ఇప్పటి వరకు తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించాం. ఎస్సీ ఉపకులాల ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించాం. చివరగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దళిత, దాని ఉపకులాల నుంచి దరఖాస్తులను స్వీకరించాం. వారి అభిప్రాయాలను తెలుసుకున్నాం. రాష్టంలోనే ఎక్కడాలేని విధంగా జిల్లాలో విశేష స్పందన కనిపించింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 8వేల దరఖాస్తులు అందాయి. ప్రతీ దరఖాస్తును పరిశీలించి కులాల వారీగా స్థితిగతులను అధ్యయనం చేస్తున్నాం. దీనిపై ప్రభుత్వానికి త్వరలోనే సమగ్ర నివేదిక అందజేస్తాం.

– షమీమ్ అక్తర్, కమిషన్ చైర్మన్

రాష్ట్రంలోనే అత్యల్పం



తిర్యాణిలో చలిమంట కాగుతున్న ఆదివాసీలు


- రెండు రోజులుగా మళ్లీ చలితీవ్రత
- గజ గజ వణుకుతున్న ఏజెన్సీ ప్రాంతాలు
- గిన్నెధరి, సిర్పూర్(యూ)లో 6.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

తిర్యాణి(ఆసిఫాబాద్): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో దాదాపు పదిరోజుల పాటు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో ప్రతిరోజూ సగటు కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పైనే ఉన్నాయి. న్యూఇయర్ వేడుకల సమయంలోనూ చలి అంతగా లేదు. మళ్లీ రెండు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదువుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు గజ గజ వణుకుతున్నాయి. ఉదయం 8 గంటల వరకు చలి గాలులు వీస్తున్నాయి. చలి గాలులకు ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు

జిల్లాలో రెండు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల లోపే ఉంటున్నాయి. మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఏజెన్సీ మండలాల్లో చలి మరింత వణికిస్తోంది. గురువారం సిర్పూర్(యూ)లో 7.3, తిర్యాణి మండలం గిన్నెధరిలో 8.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన విషయం తెలిసిందే. శుక్రవారం చలి మరింత పెరిగి గిన్నెధరిలో, సిర్పూర్(యూ)లో కనిష్ట ఉష్ణోగ్రతలు 6.5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. అలాగే తిర్యాణి మండల కేంద్రంలో 7.9, కెరమెరిలో 9.3, కెరమెరి మండలం ధనోరాలో 9.8, వాంకిడిలో 10.4, కాగజ్‌నగర్‌లో 10.5, జంబుగాలో 10.6, రెబ్బెనలో 11.0, చింతలమానెపల్లిలో 11.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవే వాతావరణ పరిస్థితులు కొనసాగితే రెండేళ్ల క్రితం జిల్లాలో రికార్డు స్థాయిలో నమోదైన 4.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతల కంటే అత్యల్పంగా రికార్డయ్యే అవకాశం ఉంది. వాతావరణ మార్పులతో చిన్నారుల్లో జలుబు, న్యూమోనియా, వైరల్ జ్వరాలు విజృంభించే అవకాశం ఉంటుందని, అత్యవసరమైతే తప్పా వృద్ధులు, చిన్నారులు చలిలో తిరగొద్దని వైద్యులు సూచిస్తున్నారు. అస్తమా, ఎలర్జీలు ఉ న్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

వణుకుతూనే పనికి..




మాకు సింగరేణి ఓపెన్ కాస్టులో మొదటి షిఫ్ట్ డ్యూటీ నాలుగు గంటలకే ప్రారంభమవుతుంది. మా గ్రామం నుంచి పని ప్రదేశానికి చేరుకోవడానికి దాదాపు గంట సమయం పడుతుంది. రాత్రి 2.30 గంటలకే నిద్రలేచి పని తయారు కావాలి. మూడు గంటలకు ఇంటి నుంచి బయలుదేరుతాం. ఉన్ని దుస్తులు వేసుకున్న చలిలో వణుకుతూనే పనికి వెళ్తున్నాం.

– తిరుపతి, కార్మికుడు, గ్రామం.సుంగాపూర్

రెండోరోజూ వైద్య విద్యార్థుల ఆందోళన

- సమస్యల పరిష్కారానికి డీఎంవో హామీ


ఆసిఫాబాద్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు రెండోరోజూ ఆందోళనలు కొనసాగించారు. మొదటిరోజు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించగా, శుక్రవారం తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) వాణి హైదరాబాద్ నుంచి కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థులను సముదాయించి లోపలికి తీసుకెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. డీఎంఈ మాట్లాడుతూ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. విద్యార్థినులకు పాత కలెక్టరేట్ భవనంలో ఒకేచోట వసతి కల్పిస్తామని, బాలురకు నిర్మాణం ఉన్న భవనం త్వరగా పూర్తిచేసి అందులో సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల మెడికల్ కాలేజీల నుంచి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను సర్దుబాటు చేసి సోమవారం లోగా పంపిస్తామని హామీ ఇచ్చారు. పారిశుధ్య నిర్వహణ కోసం తక్షణమే 20 మందిని నియమిస్తామన్నారు. డీఎంఈ హామీలతో విద్యార్థులు ఆందోళనలను తాత్కాలికంగా విరమించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంవో వాణి

శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజం, అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు ఎస్పీ పూలమొక్కలు, స్వీట్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భైంసాటౌన్: పట్టణంలోని పూలేనగర్‌లో గల హనుమాన్ ఆలయంలో గుర్తు తెలియని దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. కాలనీవాసులు, వాచ్‌మన్ లక్ష్మణ్ కథనం ప్రకారం.. ముందుగా ఆలయ గేట్ తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దుండగుడు హుండీలో నగదు చోరీకి యత్నించాడు. వీలు కాకపోవడంతో, పక్కనే ఉన్న వాచ్‌మన్ గది తాళం పగులగొట్టి దాదాపు రూ.10వేల వరకు నగదు ఎత్తుకెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసులు తాలోడ్ శ్రీనివాస్, తాడేవార్ సాయినాథ్, ఆలయ ఇన్‌చార్జి ఆనందరావు పటేల్, తదితరులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగుడిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెప్పుల షాపులో..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్ కాలనీ బి.రాములు కాంప్లెక్స్ సమీపంలో గల గోల్డ్‌లుక్ ఫుట్‌వేర్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు వన్‌టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. రోజు మాదిరిగానే రాత్రి 9 గంటల ప్రాంతంలో షాపు మూసివేసిన యజమాని షహజాద్‌ఖాన్ శుక్రవారం ఉదయం వచ్చి చూసే సరికి షెట్టర్ పైకి ఎత్తి ఉన్నట్లు తెలిపారు. కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం

బాసర: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. స్థానిక బస్టాండ్ సమీపంలో గల శారదా ప్రియ మిల్క్ బేకరీ, గ్రామంలోని పోచమ్మగల్లిలో మరో కిరాణంలో శుక్రవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. ఘటనలో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు వాపోయారు. సంఘటన స్థలాన్ని ఎస్సై గణేశ్, ఆర్‌ఐ సందర్శించి వివరాలు సేకరించారు.

ఎలక్ట్రికల్ సామగ్రి దగ్ధం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఎలక్ట్రికల్ షాపులో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. షాపు యజమాని రాజారపు జనార్దన్ షాపు మూసి పని నిమిత్తం బయటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మీటర్‌లో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఘటనలో సుమారు రూ.50వేల సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై సాయికిరణ్, లైన్‌మెన్ మహిపా ల్ పరిశీలించి పంచనామా చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని షాపు యజమాని వేడుకుంటున్నారు.

గుడిపేట బెటాలియన్‌లో శిక్షణ కానిస్టేబుళ్ల కవాతు ప్రదర్శన



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, కమాండెంట్ వెంకటరాములు



ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ఆకట్టుకున్న శిక్షణ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శిక్షణ పొందిన పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్(కవాతు) నిర్వహించారు. కలెక్టర్ కుమార్‌దీపక్, కమాండెంట్ పి.వెంకటరాములు, రామగుండం పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ రాజు ప్రత్యేక వాహనంలో పరేడ్‌ను పరిశీలించారు. పరేడ్ కమాండర్‌తో పాటు మొత్తం 8 మంది ప్లాటూన్ కమాండర్లుగా 548 మంది దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన కరాటే, సైలెంట్ డ్రిల్, మార్కో కమాండెంట్ ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణలో భాగంగా వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు, అవుట్‌డోర్, ఇండోర్ శిక్షకులకు కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కానిస్టేబుళ్లు తమ విధులను పూర్తిస్థాయి బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. నిజాయతీగా, నిష్పక్షపాతంగా, కులమతాలకు అతీతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. శాంతిభద్రతలు, నిఘా వ్యవస్థ ఎక్కడ పటిష్ఠంగా ఉంటుందో అక్కడ ప్రజలు సుఖశాంతులతో ఉంటారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ జితేందర్ పర్యవేక్షణలో ఫ్రెండ్లీ పోలీస్‌గా తెలంగాణ పోలీస్ దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. అనంతరం కమాండెంట్ పి.వెంకటరాములు మాట్లాడుతూ విధుల నిర్వహణలో తెలివి తేటలు, శక్తి, సామర్థ్యాలతో గుర్తింపు పొందాలన్నారు. ప్రజల రక్షణలో భాగస్వామ్యం అవుతూ నేరాల అదుపుపై దృష్టి సారించాలన్నారు.

వివిధ రంగాల్లో శిక్షణ

తొమ్మిది నెలలపాటు కానిస్టేబుళ్లు వివిధ రంగాల్లో పూర్తిస్థాయిలో కఠోర శిక్షణ సాధించారు. చట్టం, న్యాయం, సాంకేతిక విద్య, నేర పరిశోధన, ఆయుధ శిక్షణ, ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్, గేమ్స్, కరాటే, యోగా, వివిధ రకాల డ్రిల్స్ తదితర అంశాలతో పాటు మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసంలో కూడా నైపుణ్యం సాధించారు.

కళకళలాడిన మైదానం

తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు విధుల్లోకి వెళ్తున్న క్రమంలో బెటాలియన్‌లో దీక్షాపరేడ్ నిర్వహించారు. ఇందులో తమ కుమారుల ప్రతిభా పాటవాలను వీక్షించేందుకు తల్లిదండ్రులు బెటాలియన్‌కు విచ్చేశారు. పరేడ్ పూర్తయిన అనంతరం శిక్షణ కానిస్టేబుళ్లు తమ తల్లిదండ్రులతో కలిసి సంతోషం పంచుకున్నారు. పరేడ్ మైదానమంతా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులతో కళకళలాడింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పోలీస్ టోపీలు ధరించి తమ వారితో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



బెటాలియన్‌లో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

అంతా ఉన్నత విద్యావంతులే..

బెటాలియన్‌లో పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ పూర్తిచేసిన 548 మందిలో 106 మంది ఇంటర్, ఎనిమిది మంది డిప్లొమా, 270 మంది డిగ్రీ 270, 41 మంది పీజీ, 70 మంది బీటెక్, ముగ్గురు ఎంటెక్, 32 మంది ఎంసీఏ, ఎంబీఏ, ఏడుగురు బీఫార్మసీ, ఆరుగురు బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ ఒకరు, ఎల్ఎల్‌బీ ఒకరు ఉన్నారు. అంతేకాకుండా సాఫ్ట్‌వేర్, ఉపాధ్యాయులు, వివిధ ప్రైవేట్ ఉద్యోగాలు చేసిన వారు కానిస్టేబుల్ ఉద్యోగం పొంది శిక్షణ పూర్తి చేశారు. అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ శ్రీనివాస్, ఆర్ఎస్సైలు రాజన్న, రాజు, రవి, శేఖర్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 45 మంది నిష్ణాతులు వీరికి అద్భుతమైన శిక్షణ ఇచ్చారు. దీక్షాంత్ పరేడ్‌లో రామగుండం అడ్మిన్ అడిషనల్ డీసీపీ సి.రాజు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాళిదాసు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ, డీఎఫ్‌వో భగవాన్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సంతోశ్‌సింగ్, ఏఓ ఉమేశ్‌కుమార్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



బీటెక్ చదివి పోలీస్ ఉద్యోగంతో ప్రజాసేవ చేసేందుకు వెళ్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి వెళ్తున్నా. బెటాలియన్‌లో శిక్షణ పొందడం మర్చిపోలేని అనుభూతి. అధికారులు ఎంతో చేయూతనిచ్చారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా.

– తల్లిదండ్రులతో కానిస్టేబుల్ పూర్ణసాయి, హైదరాబాద్

క్రమశిక్షణతో నేర్చుకున్నా



నేటి సమాజంలో సమస్య వచ్చిన వారికి ప్రత్యక్షంగా దేవుడిలా వెళ్లి ఆదుకునేవాడు పోలీస్. అలాంటి ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. బార్బర్ పనిచేస్తూ పోలీస్ ఉద్యోగం సాధించా. విజయలక్ష్మితో వివాహం నిశ్చయం కాగానే వచ్చిన ఉద్యోగంతో తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేశా. సమాజంలో అడుగుపెట్టడం సరికొత్తగా ఉంది.

– కాబోయే భార్య విజయలక్ష్మి, తల్లి జయమ్మతో కానిస్టేబుల్ శివ, రంగారెడ్డి

స్క్రాప్ పట్టివేత



పట్టుకున్న స్క్రాప్‌తో సిబ్బంది

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని మూడవ జోన్‌లో సింగరేణికి సంబంధించిన సుమారు 7 క్వింటాళ్ల విలువైన ఇనుప సామగ్రిని పట్టుకున్నట్లు ఏరియా సెక్యూరిటీ అధికారి నగునూరి రవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పలు స్క్రాప్ దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు వాహనంపై ఇనుప సామగ్రి తరలిస్తూ కనిపించడంతో వెంబడించారు. గమనించిన సదరు యువకులు ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలిపరారయ్యారు. సామగ్రి, బైక్‌ను స్వాధీనం చేసుకుని ఎస్అండ్‌పీసీ కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి ఏరియాలోని వర్క్‌షాపులో చోరీకి యత్నించినట్లు సమాచారం.

చోరీకి పాల్పడుతున్న ఒకరు అరెస్ట్

నిర్మల్‌టౌన్: పట్టణంలోని వివిధ షాపుల్లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం భాగ్యనగర్, న్యూ పోచంపాడ్ గ్రామానికి చెందిన ముప్కాల రాకేష్‌రెడ్డి గత సంవత్సరం నవంబర్‌లో పట్టణంలోని హనుమాన్ మందిరంలో చోరీకి పాల్పడగా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవలే బెయిల్‌పై బయటకు రాగా ఈనెల 1న నిర్మల్ బస్టాండ్ ఏరియాలో చోరీకి యత్నిస్తుండగా కూరగాయల వ్యాపారి సయ్యద్ యూసుఫ్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

గన్నీసంచుల గోదాంలో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- రూ.25 లక్షల ఆస్తినష్టం

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న గన్నీ సంచుల గోదాంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అక్షర ఎంటర్ ప్రైజెస్ పేరుతో నరేంద్రుల శ్రీధర్ కొంతకాలంగా గన్నీ సంచుల గోదాం నిర్వహిస్తున్నారు. రోజువారీగా కూలీలతో సంచులు కుట్టించి అవసరాలకు అనుగుణంగా ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం పంటల సీజన్ కావడంతో సామగ్రి తీసుకువచ్చి నిల్వ ఉంచాడు. మిర్చి రైతులు ఆర్డర్ ఇవ్వడంతో సంచులు కుట్టించి గోదాంలో సిద్ధంగా ఉంచాడు. శుక్రవారం తెల్లవారు జామున గోదాంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో దాదాపు 30 వేల గన్నీ సంచులు కాలిపోయాయి. ఘటనలో రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. కాగా ఘటన సమయంలో గోదాంలో నిద్రించిన కూలీలు నలుగురు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఆరుబయట ఉంచిన దాదాపు 100 వరకు గన్నీ సంచుల బ్యాండిల్స్‌కు మంటలు అంటుకోకుండా అగ్నిమాపక సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు.



కాలిన గన్నీ సంచులు

భయాందోళనలో కాలనీవాసులు

గన్నీ సంచుల గోదాంలో మంటలు చెలరేగడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. మంటలు గోదాంకు ముందున్న అంతర్గత రోడ్డు దాటి వ్యాపించినట్లయితే భారీ నష్టం జరిగి ఉండేదని పలువురు పేర్కొంటున్నారు. స్థానికులు మంటలు వ్యాపించకుండా నీళ్లు చల్లి అదుపులోకి తెచ్చారు. విద్యుత్ అధికారులకు సమాచారం అందించి కరెంట్ సరఫరా నిలిపివేయించారు. ఈ సంఘటన కాల్ టెక్స్ ఏరియాలో తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. బెల్లంపల్లి అగ్ని మాపక అధికారి ఆర్.సత్యనారాయణ, టూటౌన్ ఎస్సై మహేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, పలువురు కౌన్సిలర్లు గోదాంను పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అవుల ఓదెలు (ఫైల్)

భీమారం: గత నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. భీమారం మండల కేంద్రానికి చెందిన అవుల ఓదెలు (43)కు బెల్లంపల్లి మండలం సంద్రవెల్లికి చెందిన పద్మతో ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకోక పోవడంతో పద్మ పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి ఓదెలు తన తల్లివద్ద ఉంటున్నాడు. డిసెంబర్ 23న ఇంట్లోనే కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి 108కు సమాచారం అందించడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ఆటోడ్రైవర్..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనుకనుంచి అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నస్పూర్ మండలం సీసీసీ గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ గౌసొద్దీన్ (59)శుక్రవారం ఆటో నడుపుకుంటూ మంచిర్యాల వైపు నుంచి సీసీసీకి వెళ్తుండగా చున్నంబట్టి బస్టాప్ వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనుకనుంచి ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కందకంలో పడి వ్యక్తి..

తాండూర్: కల్లు తాగేందుకు వెళ్లి కందకంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్‌కు చెందిన పంచర్పుల శ్రీకాంత్ (30) మంచిర్యాలలో ఉంటూ మిషన్ భగీరథ పథకంలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కల్లు తాగేందుకు మిత్రుడితో కలిసి బెల్లంపల్లిలోని కన్నాలకు వెళ్లాడు. అక్కడి నుంచి బుగ్గ దేవాలయ పరిసరాలకు వెళ్లి అటవీ అధికారులు తవ్వించిన కందకంలోపడి మృతి చెందాడు. కాగా శ్రీకాంత్ మృతిపై అనుమానం ఉందని అతని తండ్రి పోశం ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిషేధాజ్ఞలు పొడిగింపు

మంచిర్యాలక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేకుండా డీజే, డ్రోన్ కెమెరాలు వినియోగించడాన్ని నిషేధిస్తూ అమలులో ఉన్న నిషేధాజ్ఞలు ఫిబ్రవరి 1 వరకు పొడిగిస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం బోనస్ కోసం అక్రమాలు



వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు



లారీలో లభించిన గన్నీసంచులు

- అడ్డంగా దొరికిన ఇద్దరు
- కేసు నమోదు చేసిన అధికారులు

దండేపల్లి(మంచిర్యాల): సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్ నొక్కేసేందుకు ప్రయత్నించిన అక్రమార్కులు అడ్డంగా దొరికారు. దండేపల్లి మండలంలో ఈ సంఘటన వెలుగు చూసింది. శుక్రవారం దండేపల్లి పోలీసుస్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీలు లింగయ్య, అంజన్న, స్రవంతి వివరాలు వెల్లడించారు. మండలంలోని కొత్తమామిడిపల్లికి చెందిన ఎంబడి సురేందర్, ధనిశెట్టి నరేష్ గ్రామంలోని కొందరు రైతుల నుంచి 70 కిలోల బరువు గల 295 బస్తాల సన్నరకం వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువకు క్వింటాల్‌కు రూ.2,650 చొప్పున కొనుగోలు చేశారు. లారీలో జమ్మికుంటలోని ఓ రైస్‌మిల్‌కు తరలిస్తుండగా ఆర్‌ఐ భూమన్న గూడెం చెక్‌పోస్ట్ వద్ద గురువారం రాత్రి పట్టుకున్నారు. ధాన్యాన్ని తరలించేందుకు గ్రామ పంచాయతీ నుంచి ఇచ్చిన ఫాం నంబరు 10లో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సంధ్యారాణి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఫోర్జరీ చేసినట్లు ఎంబడి సురేందర్ ఒప్పుకోవడంతో ధాన్యం లారీని దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


ఖాళీ గన్నీ సంచులు

ధాన్యం లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు పరిశీలించి ఆరాతీయగా పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. లారీలో 70 కిలోల బరువు గల 295 సన్నరకం వరి ధాన్యం బస్తాలతో పాటు సివిల్ సప్లయ్‌కి సంబంధించిన 570 ఖాళీ గన్నీ సంచులు లభ్యమయ్యాయి. 70 కిలోల సంచుల్లోని వరి ధాన్యాన్ని రైస్‌మిల్‌కు చేరవేసి అక్కడ సివిల్ సప్లయ్‌కి సంబంధించిన ఖాళీ గన్నీ సంచుల్లో నింపి సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అందించే రూ.500 బోనస్‌ను రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన మధ్యవర్తులు, సెంటర్ నిర్వాహకులు నొక్కేయనున్నట్లు తేలింది. ధాన్యం కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులతో పాటు ఖాళీ గన్నీ సంచులు ఇచ్చిన సెంటర్ నిర్వాహకురాలు శ్రీలతపై కేసు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు వెల్లడించారు. సమావేశంలో స్థానిక ఆర్‌ఐ బొద్దుల భూమన్న పాల్గొన్నారు.

మరో గంటలో ఇంటికి చేరాల్సి ఉండగా..

- కల్వర్టును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్: మరో గంటలో ఇంటికి చేరుకునే సమయంలో జైనూర్ మండలంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున కల్వర్టుకు కారు ఢీకొనడంతో జిల్లా కేంద్రానికి చెందిన ఒకరు మృతి చెందారు. జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారి మల్లూరి శ్రీనివాస్(40) మసాదే శ్రీనివాస్, మసాదే చింటు, నగేశ్ డిసెంబర్ 31న కర్ణాటకలోని గానుగాపురం యాత్రకు కారులో బయలుదేరి వెళ్లారు. తిరుగుప్రయాణంలో జైనూర్ మండలంలోని ప్రధాన రహదారిపై కారు కల్వర్టుకు ఢీకొనడంతో మల్లూరి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మసాదే శ్రీనివాస్, నగేశ్, చింటుకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురికి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వేర్వేరుగా నాగ్‌పూర్, కరీంనగర్, హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని సోదరుడు మల్లూరి శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న మసాదే చింటుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జైనూర్ ఎస్సై సాగర్ తెలిపారు.



మల్లూరి శ్రీనివాస్(ఫైల్)

జిల్లా వాసులకు పూలే అవార్డు



శ్యామలను సన్మానిస్తున్న సభ్యులు



అవార్డుతో పేరం అలేఖ్య

మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ ప్రభుత్వం, బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో మంచిర్యాలకు చెందిన మహిళా న్యాయవాది పేరం ఆలేఖ్య, శ్రీరాంపూర్‌కు చెందిన ఆడెపు శ్యామల సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. అలేఖ్య సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ మహిళలను చైతన్య పరిచేందుకు అనేక సేవ కార్యక్రమాలు చేపట్టారని, శ్యామల సామాజిక, రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిందని బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిమడుగు ఫ్లైఓవర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా ర్యాలీగఢ్‌పూర్‌కు చెందిన అయిత రాజు, కళ్యాణ్, ప్రభాస్ ద్విచక్ర వాహనంపై భీమిని మండలంలోని భీంపూర్ వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా పులిమడుగు సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు (24) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

కుభీర్(ముధోల్): మద్యానికి బానిసై వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పీ.రవీందర్ తెలిపారు. మండల కేంద్రమైన కుభీర్‌కు చెందిన బత్తిన్ గంగారాం (70) భార్య ఏడాది క్రితం మృతి చెందింది. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఇటీవల అ నారోగ్యానికి గురయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లో దూ లానికి ఉరేసుకున్నాడు. మృతుని కుమారుడు బత్తిన్ దిగంబర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ..

బోథ్: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుట్టపక్కతాండకు చెందిన చవాన్ గంగాసింగ్, చవాన్ బాజ్జుసింగ్ వద్ద నాలుగెకరాల చేను కౌలుకు తీసుకున్నాడు. అందులో తన చిన్నకుమారుని భార్య చవాన్ స్రవంతి వ్యవసాయం చేయనివ్వడం లేదు. గంగాసింగ్ భార్య సెవంతా బాయి (51), కోడలు స్రవంతి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం బహిర్భూమికి బయటకు వెళ్లిన సెవంతాబాయి ఇంటికి తిరిగి రాలేదు. పెద్ద కుమారుడు చవాన్ హర్‌సింగ్ చేను వద్దకు వెళ్లిచూడగా పురుగుల మందు తాగి కొట్టుకుంటూ కనిపించింది. వెంటనే బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త గంగాసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గాంధీనగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యం కావడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ మేరకు యువతి కుటుంబ సభ్యులు గాలించగా అదేవాడకు చెందిన ఓ యువకునితో హైదరాబాద్ వెళ్లినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు సదరు యువతి ఆచూకీ కనుక్కుని ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో సదరు యువకుడు హైదరాబాద్‌లోని బాచ్‌పల్లి పోలీస్ స్టేషన్లో యువతి తల్లిదండ్రులపై ఫిర్యాదు చేయడంతో బాచ్‌పెల్లి పోలీసులు పిలిపించి వేధించారని తీవ్ర మనస్తాపానికి గురైన యువతి తండ్రి ఇంట్లో పురుగుల తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. సదరు యువకునిపై యువతి ఫిర్యాదు చేయడంతో యువకుడితో పాటు, మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల మేరకు మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ గంగన్న శుక్రవారం ద్విచక్ర వాహనంపై నిర్మల్ వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జాఫ్రాపూర్ ఎక్స్ రోడ్ వద్ద నిర్మల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో గంగన్న తల, ఎడమ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుని సోదరుడు ముత్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.